క్లుప్తంగా

వాలీబాల్ పోటీలు



విజేత జట్టుకు మెమెంటో అందజేస్తున్న ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామంలో ఆ గ్రామ యువకుడు తాడి రాజేంద్రకుమార్ జ్ఞాపకార్థం స్థానిక యువత ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పది జట్లు పాల్గొనగా బొండపల్లి మండలానికి చెందిన కెరటాం గ్రామ జట్టు వాలీబాల్ పోటీలు నిలిచిం ది. ద్వితీయ స్థానంలో వైజాగ్ జట్టు, తృతీయస్థానంలో మక్కువ జట్టు నిలిచాయి. అతిథిగా హాజరైన ఎస్.భూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ చేతుల మీదుగా విజేత జట్టుకు రూ.20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేలు, తృతీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.8 వేల నగదు, మెమెంటోలు అందజేశారు.

నేడు ధారగంగమ్మ మారు పండగ

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణ ప్రజల కొంగుబంగారమైన ధారగంగమ్మ అమ్మవారి మారు పండగను మంగళవారం జరిపించేందుకు దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి స్థానిక ధారగంగమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ అర్చకులు రాజగోపాలాచార్యులు సోమవారం చెప్పారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర,రవికెలు, పూలు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారని తెలిపారు.

అన్నసమారాధన

గ్రామదేవత ధారగంగమ్మ పండగ అనంతరం మారు పండగ రోజు భక్తులకు అన్నసమారాధన చేయడం రివాజు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో టీవీ, సినీరంగ నటులతో రాత్రి 7 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డుపై కుప్పలుగా వ్యర్థాలు



తుమ్మికాపల్లి-అడ్డూరువానిపాలెం మధ్యలో రోడ్డుపై కుప్పగా భవనాల వ్యర్థాలు

కొత్తవలస: మండలంలోని అరకు–విశాఖ అంతర్ రాష్ట్ర రహదారిలో తుమ్మికాపల్లి, అడ్డూరువానిపాలెం గ్రామాల మధ్య రోడ్డుపై కొందరు భవనాల వ్యర్థాలను డంప్ చేస్తుండడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది అరకు అందాలను తిలకించేందుకు ఈ రోడ్డులో వెళుతుంటారు. కొందరు ట్రాక్టర్లతో భవన వ్యర్థాలను తీసుకువచ్చి రహదారిని ఆనుకుని కుప్పలుగా పోస్తున్నారు. ఈ వ్యర్థాల వల్ల ప్రధానంగా ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారిలో పోసిన వ్యర్థాల కుప్పలను తొలగించి, ప్రమాదాలను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని స్థానికులు, పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆ రోగ్యం లభిస్తుందని తెర్లాం–5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి అన్నారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం సోమవారం కేంద్రంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె.. లబ్ధిదారులకు పాలు, గుడ్లు తదితర పౌష్టికాహార పదార్థాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రతి నెలా ప్రభుత్వం అందిస్తున్న ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

బొబ్బిలి రూరల్: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఎం.ఆనందరావు తెలిపారు. మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో నవధాన్యాల సాగు–వాటి ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రధాన పంట సాగుకు ముందు పొలాల్లో నవధాన్యాలు వేసుకుని, మొక్కలైన తర్వాత వాటి అదే నేలలో కలియదున్నాలని తెలిపారు. దీంతో భూసారం పెరిగి, పంటకు అవసరమైన పోషకాలు నేల నుంచి అందుతాయన్నారు. అలాగే చీడపీడలు, తెగుళ్ల బారిన పంట పడకుండా రక్షణ లభిస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందరరావు నవధ్యాన్యాలు కలిపే విధానం, వాటిని పొలాల్లో సాగుచేసే పద్ధతులను వివరించారు.

నీటిని పొదుపుగా వినియోగించండి

- ఇంటింట కుళాయిలను పరిశీలించిన కేంద్ర బృందం
- ఎంపీడీఓ కార్యాలయంలో పథకాల లబ్ధిదారులు, అధికారులతో సమీక్ష



పథకాల అమలుపై లబ్ధిదారులు, అధికారులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షిస్తున్న కేంద్ర బృందం



భూదేవిపేటలో తాగునీటి కుళాయిలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గజపతినగరం రూరల్: నీటిని పొదుపుగా వినియోగించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పీఎం అవార్డుల కోసం గ్రామాలను ఎంపిక చేసే సెంట్రల్ స్పాట్ టీమ్ అధికారులు సూచించారు. హోలిస్టిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ డిస్ట్రిక్ట్ అంశంపై గ్రామాల్లో తాగునీరు సరఫరా విధానాన్ని, పారిశుద్ధ్య నిర్వహణ తీరును కేంద్రబృందం పరిశీలి స్తోంది. అందులో భాగంగానే మండలంలోని భూదేవిపేట గ్రామంలో సెంట్రల్ స్పాట్ స్టడీ టీమ్ డైరెక్టర్ వై.పి.సింగ్, అదనపు డైరెక్టర్ ఎస్.కె.వాద్వా బృందం సోమ వారం పర్యటించింది. ఇంటింట కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా విధానాన్ని పరిశీ లించారు. తాగునీరు సరఫరా చేస్తున్న వేళలు, నీటి నాణ్యతపై గ్రామస్తులను బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతప్రజలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా సమృద్ధిగా తాగునీరు అందడం చూస్తుంటే తమకెంతో ఆనందంగా ఉందన్నారు.అయితే నీటిని వృథా చేయకూడదని, భూగర్భ జలాలను పొదుపుగా వాడితే భావితరా లకు ఉపయోగపడుతుందని ప్రజలకు చెప్పా రు. తాము నివసిస్తున్న ఢిల్లీలో ఇంతటి స్వచ్ఛ మైన తాగునీరు లభించడం లేదని, మీరు చాలా అదృష్టవంతులని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇంటింట కుళా యిలు ఏర్పాటు చేశాయని అన్నారు.

పథకాల అమలుపై సమీక్ష

భూదేవిపేట పర్యటన అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో కేంద్ర బృందం సమావేశమైంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాల అమలు తీరుపై సమీక్షించా రు. వైద్య విభాగానికి సంబంధించిన మాతృవందనం, మిషన్ ఇంద్రధనస్సు, ఆరోగ్యశ్రీ పథకాలకు సంబంధించిన లబ్ధిదారులతో మాట్లాడారు. పథకాల అమలుపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేయడంతో అధికారులను అభినందించారు. అలాగే అంగన్ వాడీలు, విద్యాశాఖ పనితీరుపై అధికారులను ఆరా తీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్, ఐసీడీఎస్ పీడీ శాంతమ్మ, డీఎంహెచ్ఓ భాస్కరరావు, విజయనగరం ఆర్డీఓ సూర్యకళ, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నానిబాబు సర్పంచ్ కనకల ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సీట్లకు డిమాండ్



గర్భాం మోడల్ స్కూల్

- మోడల్‌స్కూల్, కేజీబీవీలో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి
- ఏటా ఇక్కడ సీట్ల కోసం పెరుగుతున్న డిమాండ్
- సీట్ల పరిమితిని పెంచాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మెరకముడిదాం: పేరున్న కార్పొరేట్ స్కూళ్లలో సీట్లకు ఎంత డిమాండ్ ఉంటుందో మండలంలోని గర్భాం మోడల్ స్కూల్‌తో పాటు మెరకముడిదాంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ప్రవేశాలకు అదే స్థాయిలో డిమాండ్ ఉందంటే అతిశయోక్తి కాదు. ఈ పాఠశాల ల్లో సదుపాయాలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉండడం, నిష్ణాతులైన ఉపాధ్యాయ సిబ్బంది ఉండడంతో పాటు ఉత్తీర్ణత శాతం బాగుండడంతో ఇక్కడ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. మోడల్ స్కూల్‌లో సీట్లను ఏటా ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తున్నారు. ఆరో తరగతిలో చేరేందుకు ఇటీవలే ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈపరీక్షలో విద్యార్థులు సాధించిన మార్కులతో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తున్నారు. సీట్ల కేటాయింపులో మండల విద్యార్థులకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. స్కూల్ లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులకు వసతిగృహ సౌకర్యం కూడా ఉంది. అలాగే మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆరోతరగతిలో ప్రవేశాలకు ఎలాంటి ప్రవేశపరీక్ష లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని లాటరీ ద్వారా జిల్లా ఉన్నతాధికారులు ఎంపిక చేస్తుంటారు. ఇక్కడ విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందిస్తుండడంతో పాటు వసతి సౌకర్యం కూడా బాగుండడంతో సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య వందల్లో ఉంటోంది.మోడల్ స్కూల్‌తో పాటు కేజీబీవీలో సీట్ల సంఖ్య పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్బీకేల్లో పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు



మండల వ్యవసాయ కార్యాలయంలో విత్తన మొలకశాతం పరీక్ష

జామి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఓ కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆర్బీకేల్లో 2,365 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎంటీయూ–1121 రకం విత్తనాలు 1,925 క్వింటాళ్లు, బీపీటీ 3291 రకం 160 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం (సాంబ మసూరి) 60 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 150 క్వింటాళ్లు, ఎంటీయూ 1318 రకం విత్తనాలు 50 క్వింటాళ్లు ఉన్నాయని వివరించారు. విత్తన మొలకశాతాన్ని మండల వ్యవసాయ కార్యాలయంతో పాటు ఆర్బీకేల్లో ఇప్పటికే పరీక్షించామని చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో వీఏఏలను సంప్రదించాలని సూచించారు.

రామోజీకి నివాళి

శృంగవరపుకోట: ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకులు, ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావుకు ఎస్.కోటలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు పత్రికలు, టీవీ చానళ్లలో పనిచేస్తున్న ప్రతినిధులు రామోజీ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, పూలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ జర్నలిజంలో రామోజీ అందించిన సేవలను, టీవీ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన విధానాన్ని గుర్తుచేసుకున్నారు.

విశ్వనారీ ప్రదర్శనలో ప్రతిభ



బెస్ట్ కాన్ఫిడెన్స్ సబ్ టైటిల్ అందుకుంటున్న మున్నా

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణానికి చెందిన మున్నా మైఖేల్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు విశాఖ నగరంలో గ్రీన్‌పార్క్ హోటల్ వేదికగా ఆదివారం నిర్వహించిన విశ్వనారీ–2024 ప్రదర్శనలో అద్భుత ప్రతిభ చూపారు. బెస్ట్ కాన్ఫిడెన్స్ సబ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ మున్నా స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ అకాడమీ విద్యార్థి శశాంక్ ప్రిన్స్ అండ్ ప్రిన్సెస్ ఆఫ్ ది సిటీ–2024, బెస్ట్ కాన్ఫిడెన్స్ సబ్ టైటిల్‌లో విజేతగా నిలవగా, రోషన్ అదే విభాగంలో బెస్ట్ స్మైల్‌గా నిలిచారన్నారు.

మిగులు సీట్ల భర్తీకి 15న రాత పరీక్ష

గంట్యాడ: మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్‌లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 15వ తేదీన రాతపరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రామకృష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో ఒక సీటు, 9వ తరగతిలో ఒక సీటు ఖాళీగా ఉన్నాయని, పాఠశాల తెరిచేనాటికి ఖాళీలు ఏర్పడితే వాటిని కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు గత సంవత్సరం చదివిన తరగతి ప్రామాణికంగా ఇంగ్లిష్, గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టులపై ప్రవేశ పరీక్షలో ప్రశ్నలు ఉంటాయని తెలిపారు.

అర్థన్నపాలెంలో..

కొత్తవలస: మండలంలోని అర్థన్నపాలెం గ్రామ సమీపంలోని మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీలోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బందికి అభినందనలు

నెల్లిమర్ల: ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించిన నెల్లిమర్ల ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పీటీవీ కుమార్, హెడ్‌కానిస్టేబుల్ వై.భాస్కరరావును ఏఎస్పీ అస్మా ఫర్హీన్ తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. ఆ శాఖ కమిషనర్ అందజేసిన ప్రశంసా పత్రాన్ని అందజేశారు. నెల్లిమర్ల ఎస్ఈబీ స్టేషన్ ఎస్ఐ కె కళ్యాణి, ఇతర సిబ్బంది కూడా అభినందనలు తెలిపారు.

తురాయి పూలసోయగం



అరకు-విశాఖ రోడ్డులో గాంధీనగర్ వద్ద దట్టంగా పూలతో ఉన్న తురాయి చెట్లు



గంగుబూడి జంక్షన్ వద్ద పూలు పూసిన తురాయి చెట్లతో ఆహ్లాదకరంగా ఉన్న రోడ్డు

కొత్తవలస: మండలంలోని విశాఖ– అరకు అంతర్ రాష్ట్ర రహదారికి ఇరువైపులా ఉన్న తురాయి చెట్ల పూలసోయగం ప్రకృతి ప్రియులను ఆకట్టుకుంటోంది. అరకు అందాలను తిలకించేందుకు వెళ్లే పర్యాటకులకు కొత్తవలస నుంచి పూలమార్గంలా తురాయి చెట్లు ఎర్రటి పూలతో స్వాగతం పలుకు తున్నట్లు ఉన్నాయి. ప్రధానంగా మండలంలోని అప్పన్నపాలెం, గాంధీనగర్, లక్కవరపుకోట మండలం గంగుబూడి, మల్లివీడు ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఉన్న చెట్లు దట్టంగా పూలు పూసి ఆకట్టుకుంటున్నాయి.

విద్యా కానుక కిట్ల పరిశీలన



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సిద్ధం చేసిన విద్యాకానుక కిట్లను డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. మండలంలో ఎన్ని పాఠశాల లు, ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, ఎన్ని పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ బాలభాస్కరరావును ఆరా తీశారు. మండ లంలో 50 పాఠశాలల్లోని 2,729 మంది విద్యార్థులకు పంపిణీ చేసేందు కు 23 వేల పుస్తకాలు అవసరం కాగా 22 వేలు వచ్చాయని డీఈఓకు ఎంఈఓ వివరించారు. ఈసంద ర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు గ్రామాల్లో సర్వే చేసి బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా చూడాలని ఎంఈఓను ఆదేశించారు. మండల విద్యావనరుల కేంద్రంలో చిన్నచిన్న మరమ్మతులను పూర్తి చేయాలని సూచించారు. డీఈఓ వెంట సీఎస్‌పీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పనులు సాగేనా?

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆగిపోయిన అంబటిసత్రం జంక్షన్–కొత్తపేట రోడ్డు విస్తరణ పనులు
- మాజీ ఎమ్మెల్యే కోలగట్ల చొరవతో రూ.3.15 కోట్ల నిధులు మంజూరు
- 60 అడుగుల వెడల్పుతో 500 మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం
- విస్తరణ పనులు పూర్తయితే తీరనున్న ట్రాఫిక్ సమస్య



విస్తరణ పనులు చేపట్టాల్సిన అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు ఇదే

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయిన నగరంలోని అంబటిసత్రం జంక్షన్–కొత్తపేట రోడ్ విస్తరణ పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నగర అభివృద్ధే ధ్యేయంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయడంపై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా నగరంలోని వివిధ మార్గాల్లో రోడ్ల విస్తరణ పనులు పూర్తిచేసి ప్రగతి బాటలు వేసింది. నగరంలోని నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే 1.2 కిలోమీటర్ల పొడవుగల బాలాజీ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్‌కు వెళ్లే ట్యాంక్‌బండ్ రోడ్డును 100 నుంచి 120 అడుగుల వెడల్పుతో 6 లైన్లుగా విస్తరించి వినియోగంలోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో నగరం నడిబొడ్డులో గల అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్‌కు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రారంభించినప్పటికీ ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయాయి. పనులు పూర్తియితే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పుతాయని నగర వాసులు పేర్కొంటున్నారు.

మాజీ ఎమ్మెల్యే కోలగట్ల చొరవతో...

కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో నగర సుందరీకరణ, రోడ్ల విస్తరణతో పాటు క్షేత్ర స్థాయి పర్యటనల్లో గుర్తించిన ప్రజా సమస్యలను పరిష్కరించడంలో భాగంగా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. ఇందులో భాగంగా అంబటిసత్రం, కొత్తపేట నీళ్ల ట్యాంక్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధంచేసి పనులు ప్రారంభించారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉండగా... గతంలో వచ్చిన నిధులు వినియోగించకపోవడంతో వెనక్కిమళ్లిపోయాయి. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి. మాజీ ఎమ్మెల్యే కోలగట్ల ప్రభుత్వ పెద్దలకు సమస్యను వివరించి వెనక్కి మళ్లిన నిధులను మంజూరు చేయించారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు పనులు ప్రారంభించారు.

60 మీటర్ల వెడల్పుతో 500 మీటర్ల పొడవున..

అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంకు వరకు 60 మీటర్ల వెడల్పుతో 500 మీటర్ల పొడవున రోడ్డు విస్తరణ పనులు 30 శాతం పూర్తయ్యాయి. మొత్తంగా రూ.4 కోట్లతో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉండగా... 2014–19 సంవత్సరాల మధ్య రూ.85 లక్షల మేర ఖర్చుచేసి పనులు చేపట్టలేమంటూ చేతులెత్తేశారు. అనంతరం 2019–24 సంవత్సరాల్లో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మిగిలిన రూ.3.15 కోట్లను మంజూరు చేసింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణాలు, వీధి దీపాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇప్పటి వరకు 30 శాతం పనులు పూర్తయ్యాయి. అస్తవ్యస్తంగా ఉన్న రహదారిలో బీటీ రోడ్డు వేశారు. మిగిలిన పనులు ప్రారంభించి పూర్తి చేస్తే విజయనగరం నుంచి పాలకొండకు వెళ్లే ఈ రద్దీ మార్గంలో ప్రయాణం సుగమం కానుంది.

పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం

నగరంలోని అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట రోడ్డు విస్తరణ పనులు సార్వత్రిక ఎన్నికలకు ముందే ప్రారంభించాం. ఇప్పటి వరకు 30 శాతం పనులు పూర్తిచేశాం. మిగిలిన పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. 500 మీటర్ల పొడవు గల రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం, బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. ఈ మార్గంలో రెండు మూడు భవనాలు తొలగించాల్సి ఉంది. విషయాన్ని కార్పొరేషన్ అధికారులకు చెప్పాం. చిన్నపాటి సమస్యలు పరిష్కారమైతే పనులు పూర్తి చేస్తాం.

– టి.శ్రీనివాసరావు, డీఈఈ, ఆర్అండ్‌బీ, విజయనగరం

పూసపాటిరేగ పీఏసీఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా



రాజీనామాపత్రాన్ని అందజేస్తున్న మహంతి లక్ష్మణరావు, తదితరులు

పూసపాటిరేగ: పూసపాటిరేగ పీఏసీఎస్ అధ్యక్షుడు మహంతి లక్ష్మణరావు తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సొసైటీ కార్యదర్శి ఈశ్వరరావుకు సోమవారం అందజేశారు. సొసైటీ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న పూసపాటిరేగ నారాయణమూర్తిరాజు సైతం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మహంతి లక్ష్మణరావు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమికి బాధ్యతగా పదవికి రాజీనామా చేసినట్టు తెలిపారు. తనకు పీఏసీఎస్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషిచేస్తామన్నారు. ఆయన వెంట పూసపాటిరేగ సర్పంచ్ టొంపల సీతారాం ఉన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

రాజాం సిటీ: పాలథిన్ విక్రయిస్తున్న పలు దుకాణాల్లో స్థానిక మున్సిపల్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాలిథిన్ సంచులను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. పాలిథిన్ కవర్ల అమ్మకాలపై నిషేధం ఉన్నా విక్రయాలు చేపట్టడం సరికాదని దుకాణదారులను హెచ్చరించారు.